

వంశీ

పసలపూడి ఎర్ర కంకరరోడ్డుమీద ఎరుపు రంగు పల్చటి తెరలాంటి దుమ్ము రేపి "వెల్ల"మీది నుంచి వెళ్ళే అచ్యుతాపురం టు కాకినాడ దెయ్యాల బస్సు ఆగింది. అప్పుడు సమయం బాగా రాత్రి. అన్ని బస్సులు వెళ్ళాకా ఆఖర్న వస్తుందా బస్సు. అందుకేనట దానికి దెయ్యాల బస్సు అని పేరుపెట్టారు.

ఆ రాత్రివేళ అతను రంగుపోయిన పాత రంగూన్ పెట్టె పట్టుకుని బస్సు ఎక్కుతుంటే గంగరావి చెట్టుచాటున ఉన్న అతని బీద ప్రేయసి చెయ్యి వూపుతూ శోకం నిండిన కళ్ళతో చూస్తుంది. బస్సు కిటికీలోంచి ఆమెకేసి చూశాడు. చవకరకం చినిగిన బట్టల్లో జాలిగా-బీదగా-బాధగా కన్పించిందామె. అప్పుడతనికి అన్పించింది ఆమె శరీరంపై చిరగని కొత్త శిల్కుగుడ్డ కప్పాలని.

## 2

మెట్రిక్‌తో మూడుసార్లు దెబ్బలాడి నాలుగోసారి గెల్చాడు.

సన్నగా రివటలా వున్నా అందంగా వుంటాడు. అందుకేనా ఆ ప్రేయసి అతన్ని ప్రేమించింది? కాదు మరైతే సన్నగా బక్కచిక్కినట్టుండే ఆడవాళ్ళలో సెక్స్‌దాహం చాలా విపరీతంగా వుంటుందట. సదరు సన్నటి మగాడైన అతడిలోకూడా సదరు వుద్రేకం ఇమిడివుందనా?


కాదు అసలు అలాంటిది ఏదీ కాదు. అతని దేహానికన్నా మనసుకి ప్రాముఖ్యత నిచ్చిందా యువతి. నిజంగా అతని బాహ్యా రూపం కంటే అంతర్యమే మరీ మరీ అందమైంది. అందుకే అతను వూరువిడిచి వుద్యోగానికని మద్రాసు వెళ్తుంటే గుండెలు కరిగేలాగా, హృదయం సన్నగా కడిగేలాగా ఏడ్చింది.

ఔను. జనం అతనితో అన్నారు, "వారే ప్రసాదం! నీలాంటి తెలివైన కుర్రాడు తెగించి పట్నం వెళ్తే యెవడైనా ఉద్యోగం ఇవ్వక మానడ్రా. రామచంద్రపురంలో ఆ కేరళానుం చొచ్చాడు చూడు 'రఫీ' మొదట్లో రామ కృష్ణా హోటల్లో టీ మాస్టరు. ఇప్పుడు ఎదురుగుండా వున్న మరో హోటలుకి ప్రొప్రయిటరు. అంతేరా. దూరం కొండలు నునుపట. ఉన్న వూరు ఎప్పుడూ ఆదరించదు."

రామచంద్రపురంలో ఆ చిన్న ట్రెడిల్ ప్రెస్‌లో కంపోజిటర్ ఉద్యోగంచేసే ప్రసాదం నరనరాల్లో జనం మాటలు బాగా ఇంజెక్ట్ అయ్యేయి.

ఏ పట్నం వెళ్ళాలి అని ఆలోచిస్తుండగా చెన్నపట్నం గుర్తొచ్చింది. ఔనౌను అక్కడ సినిమా ఇండస్ట్రీ వుంది. రకరకాల తెలుగు పత్రికలూ—వాటిని ముద్రించే ప్రెస్సులూ వున్నాయ్.

ప్రస్తుతానికి చిన్న ఉద్యోగం దొరికి ఆ తర్వాత శాశ్వతానికి మరో మార్గం దొరక్కుండా వుంటుందా? లేదు లేదు దొరికే



ఆస్కారాలు బాగా కన్పిస్తున్నాయ్. మద్రాసే బయలుదేరాలి. ఔను మద్రాసు.

ఆ కారణంగా అచ్యుతాపురం టు కాకినాడ వయా "వెల్ల" బస్సు ఎక్కాడు ప్రసాదం.

## 3

మద్రాసు !!!

తనేదో అనుకున్నాడు-మరేదో, యింకేదో వూహించుకున్నాడు. కానీ అమ్మో!

భయంకరమైన ఊబిలా వుందీ వూరు. చెడిపోయిన స్త్రీ శరీరంలా-స్పృశిస్తే పాపంలావుంది.

అసలు వచ్చేముందు ఏమనుకున్నాడూ యీ వూరు గురించి? తను సిన్మా స్క్రీన్ మీద అందమైన మనుషుల్ని లాలిత్యమైన మనసుల్నీ చూశాడు. నిశ్శబ్దమైన ప్రకృతినీ పారి పాల నురుగులా పొంగే సెలయేళ్ళనీ - చూశాడు. అలాగే ఏ ప్రెస్సుకెళ్ళినా మరే సంస్థకెళ్ళినా మర్యాదజేసి ఉద్యోగం ఇస్తారు అనుకున్నాడు. కానీ ఇక్కడంతా మిధ్య-మృగ్యం-తారుమారు.

ఓ దినం మద్రాసులో వో చెడిపోయిన స్త్రీలుండే ప్రాంతంలో వో తెలుగుప్రెస్సు కనబడితే వెళ్ళాడు. ప్రెస్సు అరుగుమీద నిలబడి ఆ వీధిని పరికించి చూస్తే పగటివేళ రాక్షసుడు సంచరిస్తాడని తలుపులుమూసుకుని రాత్రివేళలు మాత్రమే తెరిచే జానపద కథలు స్మరణకొస్తున్నాయ్. ఆ ప్రాంతమంతా రాత్రివేళలు దేహంతో వ్యాపారంచేసి పగలంతా సుషుప్తా

వస్థలో దొర్లి మూల్గుతూ పగటిని రాత్రిగా రాత్రిని పగలుగా మార్చుకుని బ్రతికే రకం స్త్రీలున్న ప్రాంతం.

లోనికెళ్ళాడు.

ప్రెస్సు యజమాని ప్రసాదం ముందు ఇంటర్వ్యూ ఆఫీసరు అవతారమెత్తాడు.

అతడి వాడయిన ప్రశ్నలకి చాలా ఓపిగ్గా సమాధానా లిచ్చేడు ప్రసాదం.

తొంబై రూపాయిల జీతంమీద ఉద్యోగం దొరికింది కడకి. కంపోజిటర్ వుద్యోగం.

కొండెక్కినంత ఆనందమైంది ప్రసాదానికి. తనకి వూళ్ళో వుద్యోగం దొరికింది. ఆనందంగా వుండదూ!!!

## 4

తినగా తినగా వేపాకులో తియ్యదనం పుడుతుంది. స్త్రీని అనుభవించగా అనుభవించగా అసహ్యమో వైరాగ్యమో పుడుతుంది. అలాగే వుండగా వుండగా యీ వూరు కష్టాలు తెల్సి వచ్చాయి ప్రసాదానికి. తొంబై రూపాయిల్తో రెండుపూటలు తింటూ బ్రతకలేనని తెల్సుకున్నాడు.

సహోద్యోగి పాండురంగంతో అదే చెప్పి "ఔనూ! యీ జీతంతో జీవితాన్నెలా నెట్టుకొస్తున్నావ్?" అనడిగాడు.

పాండురంగం పళ్ళు బయటపెట్టి పదిలంగా నవ్వాడు ఆ ప్రశ్నకి.

"నువ్వు ఓవర్టైమ్ జాబ్ చేస్తానంటే చెప్పు తంబీ! ప్రొప్రయిటర్తో నేను మాట్లాడ్తాను. అన్నట్టు ఓ.టీ.కి గంటకి యింతని వుంటుంది. ఎమౌంట్ చాలా ఎక్కువే ఇస్తారు" అన్నాడు పాండురంగం.

అతని మాటకికాస్సేపు ఆలోచించుకోకుండా "సరే చేస్తాను" అనిఒప్పేసుకున్నాడు ప్రసాదం.

"నైట్టైమ్ నువ్వు ఎంతసేపయినా వర్క్ చేసుకోవచ్చు. నీ ఓపికనిబట్టి ఉంటుంది ప్రతిఫలం" అని చెప్పాడు పాండురంగం.

ఆ ప్రెస్సులో ఎడ్యుకేషనల్ బుక్సూ ప్రబంధాలూ-కవితా సంపుటాలు ప్రచురిస్తుంటారు. రాత్రివేళలుకూడా ముద్రణ జరిగేంత యెక్కువగా వుండదు వర్కు.

మరేం అచ్చువేస్తారు ఆ పాండురంగం చెప్పిన రాత్రివేళల్లో???

## 5

ఆమె దేహంమీద మరే అచ్ఛాదనా లేదు.

అడుగు దళసరి ఉన్న ఆ ఫోమ్ బెడ్లో ఆమె కూరుకుపోతూ కామోన్మాదంతో ఫిట్స్ వొచ్చినట్టు గిలగిలా కొట్టుకుంటోంది.

అతనొచ్చి ఆ గుమ్మానికున్న కర్టెన్ అంచు తీసి పళ్ళకొసల్తో కొరుకుతూ ఆమెని చూస్తున్నాడు.

ఆమె రారా అని సైగచేసింది కళ్ళతో.

అతనొచ్చి ఆమెమీద పడ్డాడు విరిగిన నాగమల్లి కొమ్మలా.

"అబ్బా ఇంతసేపా?"

"ఎంత సేపయిందని?"

"నిరీక్షణలోవున్న బాధ నీకుతెలీదులేమరి."

"నిరీక్షిస్తేనే నీలోనిది మరింత పటిష్ఠం ఔతుంది."

"సరే లే ఇటు జరిగి, నీ చెయ్యి నా నడుం చుట్టూ అలు "


ఆ రాత్రివేళ కేసుమీద పెట్టిన వో సెక్స్ కథ వ్రాతప్రతి చదూతూ చెస్మీద స్లైపుల్ని కంపోజ్ చేస్తున్న ప్రసాదం చేతులు ఒణుకుతున్నాయ్. గుండెలు కొట్టుకోడం చెవులకి స్పష్టంగా విన్పిస్తోంది. రక్తం వెడెక్కిమరుగుతున్నట్టు తనకి అనుమానమే.

దాహం. ఏదో దాహం. ఏదో ఆవశ్యకత దేహానికి

లేకుంటే దొరక్కుంటే దాహం తీరదు—రక్తం చల్లారదు—తనని నలిపి నరకంలోకి విసిరెయ్యడం ఖాయం—ఔను. ఔనౌను.

కోరిక వోపక్క ప్రేరేపిస్తూ మరి అక్కడినుంచి లేచి చేతులూ, ముఖం నీళ్ళతో కడిగి, నల్లటి మసిబట్టలు విప్పి మరకలున్న గోడకున్న మేకుకి తగిలించిన తన తెల్లబట్టల్ని తీసి దేహానికి తగిలించుకుని ఇక బయలుదేరాడా వీధిలోనికి.

కుళ్ళుకాల్వల పక్కన తాటాకు గుడిశల ముందు ఉతికిన శిల్కుబట్టలు కట్టుకుని అరవ




తెలుగులోనూ, శుద్ధ అరవంలోను, మళయాళం లోనూ కబుర్లాడుకుంటున్న పిల్లలు (వాళ్ళ నలాగే పిలిస్తే బావుంటుందట) కన్పించారు.

వో గుడిశముందు పిల్ల 'రా' అని సైగ చేసింది.

ఆమె పిలుపులో శక్తి అని దేహంలో హోరు కలిపి ప్రసాదాన్ని ఆ వైపుకి మళ్ళించాయ్.

ఆ అర్థరాత్రివేళ ఆ మురికి గుడిశలో ఇరుకు మంచంమీద కుళ్ళిన దుప్పటికి మొట్ట మొదటిసారిగా పాడయ్యాడు ప్రసాదం.

అతని తలకింద ఆసమయంలోవున్న కుళ్ళు దిండులో కుళ్ళు మస్కిష్కానికి సోకి పాకినట్టు అనుమానం.

## 6

ఔను ప్రసాదం పాడైపోయాడు.

రాత్రివేళలు ప్రెస్‌లో సెక్స్ మేటర్ కంపోజ్ చేస్తూండగా ఉద్రేకం కల్గితే వెంటనే చేతులూ, ముఖం కడుక్కొని, బట్టలు వేసుకుని ఆ వీధిలో స్త్రీల ఇళ్ళకి బయల్దేరుకున్నాడు చాలా రెగ్యులర్‌గా.

ప్రసాదం రక్తం కుళ్ళుతోంది—ప్రసాదం దేహం పాడవుతోంది.

తనకి తెల్సు. కానీ, వూహలు మనసంతా పాకి ఒంటిని వేడెక్కించి అటు పొమ్మంటున్నాయ్.

## 7

మీ అమ్మ మృతశయ్యమీదుంది. వెంటనే నువ్వు రావాల్సింది- అని వాళ్ళ నాన్న రాసిన ఉత్తరం అందింది.

రెండేళ్ళ తర్వాత పట్నంనుంచి వాళ్ళవూరు వెళ్తున్నాడు. యీ రెండేళ్ళలో తనలో వచ్చిన మార్పుని తల్చుకుంటూ ప్రయాణిస్తున్నాడు ప్రసాదం.

## 8

పసలపూడి ఎర్ర కంకరరోడ్డుమీద ఎరుపు రంగు పల్చటి తెరలాంటి దుమ్మురేపి "వెల్ల" మీదినుంచి వెళ్ళే అచ్యుతాపురం టు కాకినాడ దెయ్యాల బస్సు ఆగింది.

అతను టిప్‌టాప్ కంపెనీ ఎర్ర సూట్‌కేస్ పట్టుకుని బస్సు దిగుతుంటే, గంగారావి చెట్టు చాటున ఉన్న అతని బీద ప్రేయసి చెయ్యి ఊపుతూ బస్సుదిగి వస్తూన్న ప్రియుడికేసి చూస్తూంది మెరిసే కళ్ళతో. అతను ఆమెకేసి చూశాడు. చవకరకం చిరిగినబట్టల్లో జాలిగా - బీదగా-బాధగా కన్పించిందామె. అప్పుడతని కన్పించింది—

ఆమె దేహంపై ఆచ్ఛాదనని తొలగించి ఆ గంగరావి చెట్టు చాటుకి ఆ చీకట్లోకి ఆమెని తీసుకుపోవాలని. □